# వైతరణి కిటూ, అటూ

శ్రీ వాకాటి పాండురంగారావ్

"ఇది పూర్తిచేసి ఇవ్వండి" అంటూ నర్సు వెంకట్రావు చేతికి ఏదో ఫారాల నిచ్చింది.

పూర్తిచేసి ఇచ్చాడు.

వార్డుబాయ్ కాబోలు, మేడమీదినుండి దిగి వచ్చాడు. వాడిని నర్సడిగింది 'ఒకటో నెంబరు బెడ్ ఖాళీ అయిందా?'

వాడు నవ్వాడు. 'భోజనం అయ్యాక కాని వెళ్లరట!'

నర్సుకు కోపం వచ్చింది; కాని బయటికి కనపడ నివ్వలేదు.

వెంకట్రావ్‌కు ఏదో చెప్పబోయింది; ఇంతలో సిక్కు డాక్టరు ఒకతడువచ్చి ఏదోచెప్పసాగాడు. పేషంటు ఎవడికో మందులూ మాకులూ చెప్పాడు. అవన్నీ చార్టులో రాసుకుంది నర్సు.

ప్రక్కనేవున్న వార్డులోంచి ఒక పేషంటు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి—'బెల్ ఎన్నిసార్లు నొక్కినా వార్డుబాయ్ రాడేమిటమ్మా' అని విసుక్కున్నాడు.

'ఇప్పుడే పంపిస్తాను. మీరు పదండి' అని వెంకట్రావు వైపు తిరిగింది ఆమె.

'ఒంటిగంట దాటాకకాని మీకు బెడ్ ఖాళీ కాదు.'

'ఫరవాలేదు లెండి.'

'మీకు బ్లడ్, యూరిన్ పరీక్షలన్నీ—'

'అయిపోయాయి. నేను సాయంత్రం అయిదు గంటలకు వస్తే సరిపోతుందా?'

నర్సుమొహంలో పెద్దరిలీఫ్: 'ఓ ఎస్, ఆ వేళకి బెడ్ సిద్ధంగా వుంటుంది.'

ఆస్పత్రినుండి బయటపడ్డాడు వెంకట్రావు; అతడితో బాటే లక్ష్మి.

వీధిలో ఎండ. .అరె.....ఆస్పత్రి లోపల వుండగా ఎండను కూడా గమనించలేదు...

కళ్లుపొడిచే జాత్రై నెల ఎండ. .బర్రు బర్రుమంటూ కార్లూ, టాక్సీలూ ఆటోరిక్షాలు వెళ్తున్నాయి. మిట్టమధ్యాహ్నం వేళకూడా జనానికి ఇంత అర్జెంటు పనులేమిటి వుంటాయో? ఆ ప్రక్కనే వాడెవడో ఒక బండిమీద పెట్టుకుని రొట్టెలు, గుగ్గిళ్లు, అన్నము—అమ్ముతున్నాడు. సెనగల గుగ్గిళ్లు, దాన్ని 'ఛోలే'—అంటారీ ఢిల్లీలో. ఎర్రటి గుగ్గిళ్ళ శరీరంమీద వగల్లాగ చ్చరటి టొమేటో ముక్కల్ని పచ్చటి పచ్చిమిరపకాయలను అలంకరించాడు. చూస్తుంటే నోరూరేటట్లుంది...కాని వాడు ఎడమ చేత్తో ముట్టుకోవడం...

ఎడమచేయి అనగానే భోజరాజు తన సింహాసనంమీద భవభూతిని ఎడమవైపు, కాళిదాసును కుడివైపు కూర్చోపెట్టుకోవడం గుర్తుకొస్తుంది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ కలిసి పూర్తి చేసిన శ్లోకం గుర్తుకొస్తుంది. పాపం భవభూతి ఎప్పుడూ లెఫ్టే! కాళిదాసు ఎంతయినా 'కల' వాడే...

అంతకూ ఏం చేయడం—ఇంకా మూడు గంటలసేపుంది. రేపు ఆపరేషను! అంతా గమ్మత్తుగా వుంది. 'ఈ నడిబజారులో నేడు నిటారుగా నడిచి వెళ్తున్న తాను రేపు అడ్డంగా ఆపరేషను టేబిలు మీద...!

అలా దారిన వెళ్తున్నవాడి నెవరినయినా ఆపి—'మేష్టారూ! మీకు తెలుసూ—నాకు రేపు ఆపరేషన్ జరగబోతుందని—' అని చెబితే వాడేమనుకుంటాడు? ఎవడో పిచ్చివాడు అనుకుంటాడా? ఏ పావలా డబ్బులకోసమో ఎత్తులు వేస్తున్నాడు అనుకుంటాడా?

వెంకట్రావు ప్రక్కనే లక్ష్మి నడుస్తోంది. ఎప్పుడూ గల గల మని మాట్లాడుతుండేది, చాలా మౌనంగా నడుస్తోంది.

సాధారణ పరిస్థితులలో కాకుల్లా వాగేవారికి అసాధారణ పరిస్థితుల్లో నోరు మూతపడిపోతుంది. ఎంచేత,...భయం?

భయం!

ఎందుకు భయం? ఏమవుతుందో...ఎట్లా అవుతుందో... 'నూతిలో చిలకేదిరా అన్నా' అన్నట్లు అయిపోతుందేమోనని భయం...

భయం ఎందుకుండాలి, బాధ వుండాలి గాని ..

మిత్రుడు కావచ్చు, తల్లి కావచ్చు, మొగుడు కావచ్చు— ఈ జీవితపు రైలుబండిలో ఎన్నో పెట్టెలుండగా ఒకే పెట్టెలో పక్క పక్కన కూచుని, ఒకరి కొకరు సన్నిహితమై ఇన్నాళ్ళు ఇన్నేళ్లు పయనించామే, ఇంత దగ్గరయ్యామే—అలాటిది ఇప్పుడు విడిపోయామే అన్న బాధ వుండాలి. ఈ సాన్నిహిత్యం, ఈ స్మృతి పుంజం, ఈ మాధుర్యం ఇవన్నీ అబద్ధాలేనా — ఇక ముందెన్నడయినా కలిసేమా, మళ్లీ కలిసి పయనించేమా — అన్న బాధ వుంటుంది కాని .భయం ఎందుకు—

అవును మరి భయమే... చేతిలో వున్నది, వున్నది

అనుకొన్నది, తనది అనుకున్నది జారిపోతుంది అనగానే భయమే... అందుకనే కాబోలు—'ఏదీ నాది కాదు' అన్న భావాన్ని అలవర్చుకో మంటుంది మన మతం. బుద్ధుడూ చెప్పింది అదే కదా...ఆశయే దుఃఖానికి కారణం.

ఎవరెన్ని చెప్పినా భర్తకు రేపు కడుపులో ఆపరేషనంటే ఇవాళ దిగులుగా వుండని భార్య ఎవరు...

'ఏం లక్ష్మీ! దేనికయినా సినిమాకు వెళ్దామా...'

చిత్తరపోయి చూచింది లక్ష్మి.

'ఇంగ్లీషుదయితే అయిదున్నరకెల్లా అయిపోతుంది—' శాంతిగా, వింతగా, ఏమిటో బాబూ మీ ధోరణి నా కర్థం కాదు—అన్నట్లు నవ్వింది.

ఆటోరిక్షా ఎక్కి 'రివోలి' చేరారు.

సినిమా పేరు 'ట్లో అవ్' అందమైన సినిమా. ఒక ఫోటోగ్రాఫర్ జీవితంలోకి వచ్చిపడిన అపరాధ పరిశోధన—విశాల మయిన పచ్చటి బయళ్ళు — వేగంగా పరుగెత్తే కార్లు — అడుగడుక్కీ తిలకింపదగినవే కథాసంవిధానం.

ఇంటర్వెల్‌లో అయిస్‌క్రీము తిన్నారు. లక్ష్మి వదనం అల్లాగే కులాసాగా వుంది. అసలు, సినిమానయినా చూచిందో లేక ఏ వెంకటేశ్వరుడికో ప్రార్థనలు చెప్పుకుంటూందో—

అయిదున్నరకు ఆస్పత్రి చేరారు.

నర్సుల గదిలో—

ఆ తెల్లటి యూనిఫారాల్లో నవ్వుతూ వుండే నర్సులందరూ ఒక్కలాగే కన్పిస్తారు...కాని మధ్యాహ్నం మాట్లాడిన ఆమె లేదు. వెంకట్రావ్ బెడ్‌సంగతి అడగ్గానే పెద్దనర్సు కాబోలు చెప్పింది—'వెండింటమండి మీకోసం వెతుకుతున్నాము—'

మేడమీదకు వార్డుబాయ్ తీసుకువెళ్లాడు.

స్పెషల్ వార్డు.

ఉన్న అయిదు మంచాల్లో ఒకదానిని చూపించాడు. దాని మీద ఎవరో, అవతలిమంచంమీది రోగులకోసం వచ్చిన విజిటర్స్ కూర్చునివున్నారు. లేచారు.

గదిలో అంతమందీ ఇటు తిరిగిచూశారు. కొద్దిగా ఇబ్బంది అన్పించింది. వెళ్ళి కూచున్నాడు వెంకట్రావ్. లక్ష్మి మంచం చివర కూర్చుంది. లక్ష్మి పాలిటికి ఇది యమధర్మరాజు ఇంటర్వ్యూ గదిలా వుంది కాబోలు...ఆమె వదనాకాశంలో కారుమేఘాలు తిరుగ సాగాయి.

ఆ విబ్భ్రాంతనాన్ని బద్దలు గొడదామని బలవంతంగా ఏదో మాట్లాడాడు లక్ష్మితో—మిగతావారి భాష వేరు గనక కొంత రక్షణ.

కాస్సేపటికి ఆ గదిలో తానూ ఒకడిని అనిపించినాక వెంకట్రావు అటూ యిటూ పరికించాడు.

కిటికీ నానుకుని, ప్రక్కమంచంమీద గళ్లపైజమా శాల్తీ, పెళ్లాం అందిస్తున్న ఆపిల్‌ముక్కల్ని తింటున్నాడు. నవ్వుతుంటు న్నారు వాళ్లిద్దరూ తమ్ము చూచేనా?

తన కాళ్లవైపు గది మధ్యగా మొహం కనబడలేదు. ముక్కు లోకి పెట్టిన రబ్బరుగొట్టం కదులుతున్న మనిషి...అతడికోసం ఎంత పరివారం! ఆమూల ఎడమవైపు కర్టెన్లు దాస్తున్న వ్యక్తికి ఏమి జబ్బో?

ఆటే కుడివైపుగా ఏటవాలుగా పడుకునివున్న మనిషి బాగానే వున్నట్లున్నాడు. భార్యతో మాట్లాడుతున్నాడు.

గది మధ్యనున్న పేషెంటు తాలూకు డజనున్నర శాల్తీలలో ఒక వెడల్పాటి హిడింబి ఇహ వుండబట్టలేకపోయింది; అడిగింది.

'ఏమిటి మీ జబ్బు—'

గదంతా వెంకట్రావు జవాబుకోసం ఎదురుచూస్తూంది!

అతడికి ఒళ్లు మండింది. 'ఏదో లెండి...'

హిడింబి వూరుకోలేదు. 'అంటే?'

'రేపు ఆపరేషన్!'

వెంటనే అటుతిరిగి టనటా బునటా అంటూ వెంటాసిలో తన వాళ్లకు అనువదించి చెప్పింది—పాపం, ఆడా, మగా అందరికీ పెద్ద సమస్య తీరిపోయినట్లయింది. మామూలు గందరగోళంలోకి వచ్చారు.

వాళ్లందరికీ తాము క్రొత్త అన్న ఫీలింగ్ పోతేగాని బాగుండదు.

గంట మ్రోగింది; విజిటర్లు వెళ్లిపోవాలి.

దిగులు లక్ష్మి కళ్లల్లోకి ద్రవించింది. కన్నీటి నాపుకోవడానికి ప్రయత్నిస్తూంది.

'వెళ్లిరానా'

'వెళ్లిరా'

'జాగ్రత్త'

'ఏమీ ఫరవాలేదు—డాక్టరు చెప్పాడు కదా—రేపీపాటికి ఆపరేషనయిపోయి హాయిగా వుంటుంది—'

లక్ష్మిపాలిటికి ఈ ఇరవైనాలుగ్గంటలూ ఇరవైనాలుగు యుగాలు.

వార్డుబాయ్ అరుస్తున్నాడు...'వెళ్ళండి—వెళ్ళండి.'

వెళ్ళలేక, వెళ్ళలేక—

వెళ్లింది లక్ష్మి.

విజిటర్లు తగ్గారు...మధ్య మంచమాయన తాలూకువాళ్ళు నలుగురుండిపోయారు. ప్రక్క మంచం మీద గళ్ళ పైజమావాడి భార్య కులాసాగా సెలవు తీసుకుంది. కుడిప్రక్క ఆ మూల పేషంటు భార్య ఎపుడో వెళ్ళిపోయింది; వాడేమో సిగరెట్లు ఊది పారేస్తున్నాడు. ఆ మూల ఎడమప్రక్క కర్టెను వెనక మనిషికి విజిటర్స్ లేరా?

ఈ గదిలో తన సహచరుల పూర్వాపరాలు తెలుసుకోవాలి... వెధవ కుతూహలం.

దీపాలు వెలిగాయి. కిటికీలోంచి బయటకు చూస్తే చీకటి. బయటి ప్రపంచమంతటా రోగంలాంటి, భయంలాంటి చీకటి... ఆస్పత్రిలోపల దేవుడి గుడిలో వలె వెలుతురు...అది వేరు ప్రపంచం, ఇది వేరు ప్రపంచం. అక్కడ మనిషి మీద ఎన్నో పొరలు, తెరలు, హోదాలు, గోడలు పేరుకుని వుంటాయి ఇక్కడ ఆ ఉల్లిపొరలన్నీ లేచిపోగా మనిషి పునాదులు కనపడతాయి.

ఇందాక విజిటర్స్, ఆ గోల, ఆ వాతావరణం వేరు. ఇప్పుడీ వాతావరణం వేరు. పాటకూ పాటకూ మధ్య నిశ్శబ్దంవలె ఎంత ప్రశాంతంగా వుంది! ఆ మధ్య మంచం వాడి మనుషులు ఇంతమంది వుండకపోతే ఇంకా ఎంత బాగుండును—

నర్సు వచ్చింది. నోరు తెరవమంది. తెరిచాడు వెంకట్రావు. థర్మామీటర్ పెట్టింది నిముషం తర్వాత తీసింది, చూచింది. మళ్ళీ నోరు తెరవమంది. ఔన్సుగ్లాసుతో ఏదో మిక్సర్ గొంతులో పోసింది...అయింది ప్రారంభం! ఇష్టాయిష్టాయున్న వ్యక్తిలా కాక, ఆదేశాలు పాటించవలసిన చిన్న బిడ్డలా జీవితం మొదలయింది. మార్పు తమాషాగా వుంది.

నర్సు చెప్పింది 'మీకీ పూట ఉత్త 'సూప్' ఇస్తారు. త్రాగండి. రేప్పొద్దున ఆపరేషన్. తెలుసుగా ?'

వెంకట్రావు గంగిరెద్దయ్యాడు.

'పొద్దున్నే 'ఎనిమా' ఇస్తారు. మంచినీళ్ళు కూడా తాగడానికి వీలులేదు.'

మళ్ళీ గంగిరెద్దు.

అవతలి మంచం దగ్గరకు వెళ్ళింది నర్సు.

కాస్సేపటికి వార్డు బాయ్ వచ్చాడు. 'ఆపరేషన్‌కు తయారుచేయాలి మిమ్మల్ని' అన్నాడు. మంచం చుట్టూ తెరలు పెట్టాడు. పది నిముషాల తర్వాత వాడు వెళ్ళిపోయాడు

సూప్ వచ్చింది. బాగాలేదనిపించింది. ఇంటి దగ్గర హాయిగా లక్ష్మితో పాపలతో కబుర్లాడుతూ కూర్చుని పప్పు, కూరా, ఆవకాయ, పెరుగు వేసుకుని అన్నం తిన్నట్టుగా వుంటుందా ...అయినా రేపల్లా మాడాలి కదా... గడ గడ తాగేశాడు సూప్‌ని.

చదువుకుందామని తెచ్చిన 'పార్కిన్సన్' తీశాడు. పదిపేజీల తర్వాత మూసేశాడు. ఈ వాతావరణానికి పార్కిన్సన్ వ్యంగ్యానికి పొత్తు కుదరడం లేదు.

పైజమా వాడి నడిగాడు—'మీకు ఏదన్నా ఆపరేషనయిందా?' పైల్సట...ఆపరేషనయి పది రోజులయిందట...రేపో ఎల్లుండో ఇంటికి వెళ్ళిపోతున్నాడట. ఆ మాట డాక్టర్ ఇవాళ సాయంకాలమే చెప్పాడట. అందుకనే కాబోలు ఇందాక ఈ దంపతులు హాయిగా నవ్వుకుంటున్నారు...వాడి పేరు గాంధీట...చావ్డీ బజార్‌లో ప్రింటింగ్ ప్రెస్సుందిట. వెంకట్రావ్ నెమ్మదిగా వివరాలు సేకరించాడు

కాళ్ళదగ్గర గది మధ్యగా వున్న ముసలాయనకు తీవ్రమయిన గుండెపోటుట.

ఆ మూల ఎడమవైపు కర్టెన్లవతలాయనకు ఊపిరితిత్తుల్లో కాక వాపారకాల బాధలూ...

అటు కుడివైపు వెంచేసియున్న ముఖర్జీగారికి గుండెపోటు.

రెండు గుండెపోట్లు, ఒక నానాజాతి సమితి, ఒక మాజీ పైల్సు ఒక కడుపుపోటు—ఇదీ ఆ వార్డు కంపోజిషన్...ఎవరినయినా ఆధునిక చిత్రకారుడికి ఈ వార్డుని వివరించి చెప్పి నైరూప్యచిత్రం ఒకటి రచించమని చెపితే, పికాసో 'గుయెర్నికా' కాకపోయినా ఆ కోవకు చెందినది ఒకటిపుట్సునా?

ఏవేవో, దోమల్లాంటి ఆలోచనలు...దీపం వుంటే నిద్ర పట్టదు...కాని ఇక్కడ దీపాలార్పమని ఎట్లా అడగడం...అసలే కోడి గడుతున్న వత్తుల్లాంటి ప్రాణాలున్న చోటు...

మధ్య ముసలాయన బంధువులు ఏవో రొట్టెలూ అవీ సంచుల్లతోసహా హాయిగా తింటున్నారు. ఆ హిడింబి, పాపం, ఆయన భార్యట...పేరు మార్వాడి...అయినా ఆయనకంత జబ్బుగా వుంటే వీళ్ళలాగ షడ్రసోపేతంగా తాపీగా భోజనం చేస్తున్నారే! సయిస్తుందా?

ఇంటిదగ్గర లక్ష్మి భోజనంచేసి వుంటుందా...వుండదు... పిల్లలు అడుగుతారు 'నాన్న ఏరీ'...ఏం చెబుతుంది లక్ష్మి...

డాక్టర్ గుప్తా వచ్చాడు. తిన్నగా వెంకట్రావు మంచం వద్దకే వచ్చాడు.

'ఎట్లా వున్నారు?' పొట్టనొక్కి చూశాడు

'ఏమీ ఫరవాలేదు. రేప్పొద్దున్న అన్నీ సరిపోతాయి' అన్నాడు. ఆయన నవ్వుతూ మాట్లాడుతుండడం చూస్తుంటేనే చాలు, సగం వ్యాధి పోతుంది.

అడపా దడపా ఏదో వస్తుండేదికాని అసలొక్కసారే వచ్చింది అంత తీవ్రమయిన కడుపునొప్పి గుప్తాయే చూచాడు. పరీక్షలన్నీ చేయించాడు. ఎక్స్‌రే తీయించాడు 'డ్యుయోడినంలో వ్రణం కొద్దిగా ఒక మూల వుంది, అది తీయించేస్తే మీకే గొడవా వుండదు. ఏమంటారు.'

'సరే'

సర్జరీవార్డులో ఖాళీలులేక రెండు వారాల తర్వాత రమ్మన్నాడు .ఆ నాటినుండి డా॥ గుప్త అంటే అభిమానం. ఆ విషయం ఆయనకు తెలుసా, లేక ఎందరో రోగులలో తానొక్కడా—

పైజమాగాంధీ పలకరించాడు 'ఇంటికి వెళ్ళడం గురించి ఆలోచిస్తున్నారా ఏమిటి?'—అని నవ్వాడు. .అదృష్టవంతుడు!

ఆ మాటనుకోగానే తనకే ఆశ్చర్యం వేసింది

నవ్వగల్గడం అదృష్టమా, రేపో ఎల్లుండో ఇంటికి వెళ్ళిపోవడం అదృష్టమా...అయినా ఇట్లాంటివాటన్నిటికీ అతీతుడు అనుకుంటున్న తనకట్లా అన్పించడం ఏమిటి? మనసు మెట్లు దిగుతున్నదా ఏమిటి? గుండెలో తన తత్వం కానిదానికి చోటు లభిస్తున్నదా ఏమిటి?

'గుడ్‌నైట్' అన్నాడు గుప్తా.

గుడ్! నైట్! హహ్హా!!

డాక్టర్ బూట్లచప్పుడు క్రమంగా నిశ్శబ్దంలోకి వెళ్లింది.

రేపు ఆపరేషను...అనెస్తీషియా— దేహంమీద కత్తిగీత— కారకు డెవడు కుజుడా, గురుడా — రేపీపాటికీ దేహం ఎట్లా వుంటుంది?...నిద్రకాదుకాని అట్లాంటిది.. మసకమసక వెలుగు... మగతమగత జాగ్రుతి--ఎక్కడో బయట ప్రపంచంలో ఆరోగ్యంగా వున్న కుక్కఅరువులు—మత్తు—నిద్రలాటిది—

పెద్దగా కేక—

ఉలిక్కిపడ్డాడు.

నిశ్శబ్దపు గాజుమేడమీదకు నిర్దాక్షిణ్యంగా విసురుతున్న కేకల రాళ్ళు—ఏమయిందేమయింది?

'సర్దార్జీ—నన్ను చంపకు సర్దార్జీ—నన్ను చచ్చిపోనివ్వు సర్దార్జీ—నేను ముసలివాడినండీ బాబూ—నన్నిట్లా బాధపెట్టకండయ్యా—అయ్యో, తండ్రీ—ఊర్కోండి నాయనా — నేను మీకేమి అపకారం చేశానండీ—నన్ను వదిలిపెట్టండీ...'

పక్క బెడ్ వాడు వెంకట్రావు. గదిలో దీపాలు. మంచాలు. మనుష్యులు అలాగే వున్నారు

ఆమూల మంచంమీద కర్టెనవతలనుండి అరుపులు—

పరుగెత్తుకొచ్చింది ఒక నర్సు.

అలాఅరుస్తూనే వున్నాడు.

ఎవడతడు—ఏ పాతని బాధ— దానికి మందేమిటి—అతడు ప్రతిమారే ఎర్దార్జీవడు--

సిస్టర్ నెమ్మదిగా—పిల్లవాడిని తల్లి బుజ్జగించినట్లు లాలింపుగా—

మల్హోత్రా, మిస్టర్ మల్హోత్రా — ఊరుకోండి ..పడుకోండి నిద్రపోండి మల్హోత్రా నిద్రపోండి—నే చెబుతాలెండి సర్దార్జీకి—మీరు నిద్రపోండి ..

పెద్దతుఫానువంటి అతడి కేకల ఎదుట ఆమె గొంతు గడ్డిపరకలా వుంది.. అసలతడికి ఆమె మాటలు వినిపిస్తున్నాయా?—గదంతా గమనిస్తూంది.

ఆమె అదే అదే మాటలను పదేపదే పాడుతూంది—లాలి లాలి హాయిహాయి—బజ్జో నా చిట్టితండ్రీ—ఆమె, లలితో, మేరియో, వెబున్నిస్సావో — ఆమె గొంతులోని వాగ్స్వరానికి మల్హోత్రాలోని సర్పం తల ఊచనారంభించింది.

'ఏమిటీ—' అన్నాడు మల్హోత్రా

'ఏమీ లేదు పడుకోండి...నిద్రపోండి...'

నిద్ర . ఎట్లాపోను...అయ్యో—బాధ—పూనావ్—నొప్పి—సర్దార్జీ—' మల్హోత్రకు స్పృహ సరిగా లేదు.

'నిద్రపోండి—నిద్రపోండి—నిద్రపోండి' — నర్సు వాగస్వరం

'అయ్యో—అయ్యయ్యో—'

వీరట్లా కేకలు పెడితే మిగతా రోగులు నిద్రపోవాలి కదా—'

అంత బాధలోను, అంతస్పృహలేమిలోను, ఆ మల్హోత్రా అన్న మనిషి మనసులోని పొరల దిగువ, ఆ బాదరణ్యపు చీకటి పొదలమాటున—ఎక్కడో దాగి వున్న ఆ మానవత్వం తటాలున మేలుకొంది—

'ఐ యామ్ షారీ షిష్టర్—షారీ—' అన్నాడు. ముసలి వాడికి పళ్లులేవు కాబోలు.

'పడుకోండి. నిద్రపోండి . నిద్రపోండి పడుకోండి...'నెమ్మదిగా అలాడితల దువ్వింది నర్సు దుప్పటి సరిచేసింది. ఆ మూల దివం ఆర్పివేసింది. ఆ తల్లి చల్లని చేతులలో ఆ రోగి తన బాధను మరిచాడు. .

మరిచాడా? మరిచినట్లే—

ఎవడీ మల్హోత్రా...ఎక్కడివాడు—ఈ మరియమ్మ ఎవరో—ఇతగాడికి ఎవరూ లేరా—నా వారనే భార్య—నా నాన్న అనుకునే బిడ్డలు—లేరా—

ఈ ప్రశ్నలకు జవాబులు తెలియడానికి, వెంట్రవాలు పట్టింది.

ఈలోగా—

మరుసటిరోజు—ఉదయం

వార్డులో అందరికీ బెడ్ 'టీ'లు ఇచ్చారు. మల్హోత్రా మగతలో నుండే వద్దన్నాడు. వెంకట్రావుకు ఇవ్వలేదు.

మేల్‌నర్స్ వచ్చి వెంకట్రావుకు ఎనీమా ఇచ్చి వెళ్లాడు.

ఏడయింది.

రొప్పుతూ, రోజుతూ వచ్చింది లక్ష్మి.

ఎట్లావుంది? నిద్రపోయారా? డాక్టరు వచ్చారా? ఏమన్నాడు?

ఆమెకు అన్నీ ప్రశ్నలే! ప్రశ్నలన్నిటిలో పెద్ద ప్రశ్న. ?

జవాబులు చెప్పాడు వెంకట్రావు.

ప్రక్కనే కూచుంది. మాట్లాడాలని వుంది మాట రావడంలేదు

ఏదేదో చెప్పాలని వుంది చెప్పలేదు. వెంకట్రావు ఆమె చెతిని నిమిరాడు.

ఏడున్నరయింది. బ్రెక్‌ఫాస్ట్ వచ్చింది.

నర్సు ఒకరవుండ్ వచ్చి వెళ్లింది.

వెంకట్రావును చూచి నవ్వింది. 'ఆపరేషన్‌కు రెడీయా?'

వెంకట్రావు తల ఊచాడు. లక్ష్మికి వణుకు.

ఎనిమిది.

వార్డుబాయ్ వచ్చాడు. స్ట్రెచ్చర్ బండి తెసుకువచ్చాడు.

'అయ్యా, పొక్కా తివ్వండి—'

లక్ష్మికి బాధ...తన దేవుడిని తనకు దూరం చేస్తున్నారే అని బాధ...అతడిని వధ్య శిల మీదకు కొనిపోతున్నట్లుగా వుంది ఆమెకు...భగవాన్...భగవాన్...

బనియన్‌తో స్ట్రెచ్చర్ మీద పడుకున్నాడు వెంకట్రావు. పైన చూరు తెల్లగా నిర్మలంగా వుంది. మనసంతా కూడా నిర్మలంగా కాకపోయినా ఖాళీగా వుంది.

స్ట్రెచ్చర్ తల వైపు లక్ష్మి.

వార్డ్‌బాయ్ వెంకట్రావు రొమ్ము వరకు బెడ్‌షీట్ కప్పాడు.

క్రొత్త నర్సు వచ్చింది. ఏదో చార్టు కాళ్ళ దగ్గర పడేసింది. ఇంజక్షనిచ్చింది.

బండి కదలింది.

లక్ష్మి మనసు కలుక్కుమంది—'కొనిపోవుచున్నారే నా నాథుని'

బండి కదలింది.

కదలి కదలి—

గుడిలోని గర్భగుడిలోకి—

ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్తూంది.

లక్ష్మి—గాంధి—మల్హోత్రా—ముఖర్జీ అంతా వెనక వుండి పోయారు.

పెద్ద తలుపులు తెరుచుకున్నాయి

చిన్నప్పుడు, పార్థసారధి కోవెలలో వైకుంఠ ఏకాదశినాడు పొద్దున్నే 'స్వర్గ వాకిలి' తెరవగానే వెళ్ళేవాడు తాను.

బండి లోపలికి—

తలుపులు మూసుకున్నాయి.

పొడుగాటి కారిడర్

కారిడార్ పొడవునా స్ట్రెచ్చర్ బళ్ళు.

స్ట్రెచ్చర్ల మీద ఆపరేషన్ కేసులు.

కుడివైపున వరసగా ఆపరేషన్ థియేటర్లు—కారిడార్‌లో మసక మసకగా దీపాల వెలుగు—గాజ్ మాస్కుల వెనక డాక్టర్ల, నర్సుల మొహాలు—వాళ్ళ రాకపోకలు—సంభాషణలు — ఎలుకలు పిల్లులు—ప్రాణ సంకటాలు, చెలగాటాలు—మాటలు – నవ్వులు—

'అప్పెండిసైటిస్ అయిందా?'

'హెర్నియా ఎక్కడ ?'

'థియేటర్ త్రీలో డా. బోస్ రాలేదా—'

'నర్స్ నర్స్—'

'ఎస్ ఎస్—'

నరసాలు—కిల కిలారవాలు — లైసాల్ వాసనలు— మెత్త మెత్తగా బూట్ల చప్పుళ్ళు—

ఎవరో వచ్చి—వెంకట్రావు నడిగారు. 'డ్యుయోడినల్ అల్సర్ కేసా ?'

'అవును.'

కదిలింది రథం.

వెంకట్రావు రథం.

హఠాత్తుగా వెలుతురు.. గది నిండా వెలుతురు—గాజులతో గోడ—ఆ గోడ మీద సూర్యుడి వెలుతురు—వెలుతురునిండిన గది—సృష్టి రహస్యాన్ని ఛేదించే గది—అనాటమీలు తెరిచే గది—ట్యూబెక్టమీలు చేసే గది—

'ఈ టేబిల్‌మీద, ఇదిగో, ఇక్కడ—ఆ చేయి ఇలా చాచండి—'

'ఇఫ్ యు డోన్ట్ మైండ్ జస్ట్ వన్ స్మాల్ ప్రిక్—'

నర్సో, డాక్టరో, ఇంకెవరివో డైలాగ్స్—'యువర్ మోస్ట్ ఒబీడియంట్లీ'గా వెంకట్రావు—

సూది కొసను చీమ కుట్టింది...'బంగారు పుట్టలో వేలు పెడితే మరి—'

మరి

చేపా చేపా—ఎందుకు ఎండలేదు

ఏమయింది చేప—?

ఏమయి—??

ఏ ???

• • •

కళ్ళు తెరిచాడు వెంకట్రావు.

ఒళ్ళమీద గూడ్సుబండి పరుగెత్తి వెళ్ళినట్లుంది

వోహ్—ఇదేమిటి—కడుపు బరువుగా—బిరుకుగా—ఏదోగా—మంటగా—బాధగా—నొప్పిగా—గా—గా—గా

ఆపరేషనయి పోయిందేమిటి? మాశాడు. తను వున్నది ఏ చోటు?

ఆస్పత్రే—కాని ఇది వేరే వార్డు—

నర్సు వచ్చింది—ఎలా వున్నారు ?

జవాబు చెప్పాడు. చెప్పేవుండాలి.

ఆ వగతలోనే లక్ష్మి కనపడింది కనపడ్డం కాదు; వచ్చింది. చూపులో వేయి మాటలు చెప్పింది. వెళ్ళిపోయింది.

డాక్టర్ గుప్తా వచ్చాడు. 'వెల్' మిస్టర్ రావ్—యు ఆర్ నౌ రిడ్ ఆఫ్ ది ట్రబుల్'

కాస్సేపటికి, ఇంకో అరగంటకీ, గంటకీ అన్పించింది—దాహంగా వుందని—మంచినీళ్ళు తాగాలని.

నర్సు వచ్చింది. అడిగాడు. నవ్వింది. తల అడ్డంగాఊపింది.

కడుపుమీద కాల్చిన గరిటలు పెట్టి పెట్టి తీస్తున్నట్లున్నది.

అంతకన్న మిన్నగా దాహం—దాహం—తృష్ణ—ప్యాస్—

నర్స్ నీళ్ళు కావాలి—

నాలుక ఎండి పోతూంది.

'ఇప్పుడు మీకు ఫీల్డ్స్ దాహం వస్తుంది—దాహం వస్తే కుట్లు ఊడగలవు—'

అయ్యబాబోయ్—ఆ మాట ఈ పాడు నాలుకకు తెలియ వద్దా—మై డియర్ దేహమా—మరి కొంతసేపు తాళుమా—ఇదంతా నీ కోసమే సుమా—

'ఉహూ—నా కిప్పుడే కూజాడు నీళ్ళు కావాలి' నాలుకగోల—

నర్స్—మరీచిక

సిస్టర్—మళ్ళీ రిక్వెస్టు—

వచ్చింది. నీళ్ళల్లో తడిపిన దూదితో పెదాలను తడిసింది

ఆహా, అమృతం! వోహో ప్రాణం.

మరో కొన్ని బొట్లు ప్లీజ—ఇంకొక్క డ్రాప్—జస్ట్ ఒక చుక్క—

'నో నో' నర్స్—నిర్దయ.

నిర్దయ దాహం—

ఇది సహారా—ఇది ఎడారి—మరి ఒయాసిస్సులేవీ—సోకీ లేకీ—ఎడారి ఓడలు ఒంటెలు—నీళ్ళు లేకనే మండలం వుండ గలవు—ఒంటెలకు ఉపదేశమయితే బాధలేదు—

ఒంటెకు ఇంకొక పేరేమిట్రా—నిఘంటువుల్లో తెలుగు పండితులు శేషాద్రిశాస్త్రి పృచ్ఛతి—

లొట్టిపిట్ట—

దానికి నామాంతరాలు తెలుసుపోయ్—

లొటిపిట—లొట్టిపిట—లొటిపిట్ట—

పిటపిట—తకతక—తహతహ — నీటికై తహతహ—నీటి బొట్టుకై విలవిల—దాహోప్పవల—వలలోచేప— నీరుబాసినచేప—కమల ములు నీటబాసెను - అంపశయ్యపై గాంగేయుడు—గంగకు పిలిచే విజయుడో—

నిదుర—మగత

డాక్టర్—నర్స్—వచ్చారు.

టెంపరేచర్ చూశారు.

ఆఫీసునుండి ఎవరు—రాజశేఖరం కాబోలు —వచ్చి వెళ్ళాడా? లక్ష్మి ఇంకోసారి వచ్చినట్లుంది.

మెలకువ వచ్చినట్లయింది.

వేకువ అయినట్లుంది.

'సిస్టర్'—

వచ్చింది.

'టైమెంత?'

'ఆరయింది.'

'మైగాడ్!' పొద్దున్న ఎనిమిదింటికి ఆపరేషన్ థియేటర్లోకి తీసుకెళ్ళారు...ఇప్పుడు ఆరయిందిట—పదిగంటలసేపు తానెక్కడ వున్నాడు—ఆపరేషన్ థియేటర్లో వెలిమీద చీమ కుట్టింది—ఆ తర్వాత ఏమయింది?

తానెక్కడ వున్నాడు? తన జీవు డెక్కడున్నాడు? ఆత్మ అనే పక్షి ఏ ఏ లోకాలు తిరిగింది? ఈ పదిగంటల కిటూ అటూ బ్రాకెట్లు తగిలించారు—బ్రాకెట్ల మధ్య ఆల్జీబ్రా అంకెలేమిటి—అనలాగ్ కంప్యూటర్ చెబుతుందా ఏమిటి?

ఇద్దరు వార్డుబాయ్‌లు—ఇద్దరు నర్సులు వచ్చారు... నెమ్మదిగా తన్ను స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టారు—స్ట్రెచ్చర్ బండి బయలుదేరింది—ఇది రికవరీ వార్డట—తను రికవర్ అయిపోయాడన్నమాట—తాను ఇక్కడనుండి తన 'లిన్' వున్న నర్సరీ స్పెషల్ వార్డు బెడ్ నెంబర్ వన్—మీదకు వెళ్తున్నాడు—అత్తారింటినుండి పుట్టింటికొస్తున్న ఆడకూతురిలా...వెళ్ళి వెళ్ళి గూడు చేరింది బండి—వాళ్ళు సాయంపట్టారు—తనూ సాయం చేసుకున్నాడు తనకు—అమ్మమ్మమ్మ—ఈ మాత్రం దానికి ఇంత అయాసమా—

'అంతా సవ్యంగా జరిగిందా?' అన్నట్లుగా చేయి చూపాడు గాంధి. కళ్ళతో జవాబిచ్చాడు.

లక్ష్మి కూచుంది ప్రక్కగా—ఆఫీసు వాళ్ళెవరో వచ్చారు, వెళ్ళారు.

గంటసేపయింది. డాక్టరు వచ్చాడు.

'దాహం—'

'కొద్దిగా, ఒకటి రెండు చెంచాలు తాగండి—ఇంకో గంట తర్వాత మళ్ళీ తాగండి—క్రమంగా పెచ్చించండి—'

ఆరాత్రి—

లక్ష్మి అక్కడే పడుకుంది. బాధ—వ్రణం—పుండు—పచ్చి పుండు—కొరిమితిత్తి—వాతలు—పోట్లు—సూదిపోట్లు—అలసట—ఆకలి అని తెలియని నీరసం—కొద్దికొద్దిగా నీరు త్రాగడం—మగత—నిద్ర—

లక్ష్మి అక్కడే ప్రక్కనే కుర్చీలో కునుకు తీసింది. తాను కదిలినప్పుడల్లా ఉలిక్కిపడేది.

ఆరాత్రి మల్హోత్రా ఆరవలేదు.

ముఖర్జీ ఇంటికి వెళ్ళిపోయాట్ట. లక్ష్మి చెప్పింది.

తెల్లవారింది. నర్స్ వచ్చింది. 'టీ తాగండి'

'టీ కాదు, కాఫీ కావాలి—'

'సరే కాఫీయే పంపమంటాను. కొద్ది కొద్దిగా త్రాగండి. రేపు సెమి-సాలిడ్స్!— సరేనా?'

'సరే-'

36 గంటల ఉపవాసం తర్వాత కాఫీ – చల్లటి కాఫీ — పానకంలాంటి కాఫీ—కాఫీపొడి మడ్డి కలసిన కాఫీ — గొంతులో నుండి క్రిందికి దిగుతుంది. ఆహా! ఏమి ఈ లగ్జరీ అనిపించింది.

న రుచి ర్నపత్యప్—'

ఈమాత్రం కాఫీకే ఇంద్రుడింట్లో ఉన్నట్టు అన్నంత ఆనందం ...

అరోజల్లా కాఫీ—పాలు—గంజి—నీరు—పాలు—గంజి—కాఫీ—

మధ్యాహ్నం ఒక కునుకు తీసి లేచాడు.

నర్స్ వచ్చి లక్ష్మిని, గదిలో ఇతరులను, బయటకు పొమ్మంది. వార్డ్‌బాయ్ మందులు, బ్యాండేజి వగయిరా నిండిన ట్రే వున్న బండిని తీసుకొచ్చాడు. మల్హోత్రా మంచందగ్గర అప్పుడు ఆ మంచం చుట్టూ తెరలు పెట్టారు. డాక్టర్—ఆసిస్టు డాక్టర్ వచ్చాడు.

'వద్దు బాబోయ్—' అని గీపెట్టాడు మల్హోత్రా.

నిద్రపోతున్న నాగుపామును లేపినట్లుయింది.

'సర్దార్జీ నీకు దండం—నన్ను బాధపెట్టకండి నాయనా—ముసలివాణ్ని—లయ్యో బాబోయ్. నేను చచ్చిపోతాను—నన్ను వదలి వేయండి—నేనే చచ్చిపోతాను'

అరుపులు—గొంతు అరిగిపోయేలా అరుపులు—గుండె ఆగి పోయేలా—అరుపులు—

కత్తెరతో బాండేజి చింపడం—బేసిన్‌లో టకటకమని ఏదో వడుతుండడం మధ్య మధ్య వినవడుతున్నాయి.

గదంతా భయంకరమైన దుర్గంధం వ్యాపించింది.

అందుకనే నర్స్ అందరినీ బయటికి పంపింది—

అరుపులమధ్య, కేకలమధ్య డాక్టర్, నర్స్ తమ విధిని నిర్వర్తించారు.

అరుపులు తగ్గాయి. డాక్టర్ నర్స్ వెళ్లిపోయారు.

వార్డ్‌బాయ్ పౌడర్ ఏదో ఆ మూలంతా చల్లాడు.

శరీరవ్రణ దుర్గంధం వెర్సస్ శాండల్‌వుడ్ టాల్కం పౌరభం!

ఆ రాత్రి నిద్రపట్టింది. కాని పొర్లడానికి వీలులేదు

ఎప్పుడో పదిగంటలప్పుడు మెలకువ వస్తే, భూషణ్—ఆ మధ్యనున్న ముసలాయన నాల్గో కొడుకు వచ్చి మంచంమీద కూచున్నాడు—'రావ్‌సాబ్? ఎట్లావుంది?'

రెండ్రోజుల్లో వాళ్ళూ తనూ—ఒకే ఇంటిలో కాపురం వుంటున్నంత చనువేర్పడింది మొదటిరోజు ఒకరినొకరు చూసి నప్పటి కొత్తదనం—సందేహం—అయిష్టత ఏమయ్యాయో—

భూషణ్ బొద్దుగా, చామనచాయగా వుంటాడు బి ఎ చదువుతున్నాట్ట వాళ్లనాన్న మెహ్రాకు నలుగురు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళున్నారట ఆయన ఉద్యోగంనుండి రిటైరయి రెండే ళ్ళయిందట పెద్దకొడుకు అంటే భూషణ్ పెద్దన్నయ్యకు పెళ్ళయింది సివిల్ ఇంజనీర్‌గా వుండేవాడట—అతడికి అమెరి కాలో ఏదో ఉద్యోగం వస్తే, తండ్రికి చెప్పలేదుట చెబుతే ఆయన వప్పంటాడట ఇంట్లో ఎవ్వరూకూడా మెహ్రామాటను జరదాట రట అంచేత పెద్దకొడుకు ఉద్యోగం రాగానే ఎవరికీ చెప్ప కుండా, ఆగ్రాదాకా వెళ్తున్నానని చెప్పి భార్యతోబాటు అమెరి కాకు వెళ్ళిపోయాట్ట రెండురోజుల తర్వాత ఆ విషయం తెలిసిన [illegible] కు తీవ్రమయిన గుండెపోటు వచ్చిందట... [illegible] చెప్పి మూడువారాలు దాటిందట...ఒక వారంనుండి యూరినరీ కాంప్లికేషన్స్ మొదలయ్యాయట—

ఆ మూల మల్హోత్రా రిటైరయిన మేజిస్ట్రేటుట. ఆయన పెళ్ళానికి జబ్బుగా వుంటే ఇదే ఆస్పత్రిలో చేర్చారట. ఆరు నెలలపాటు ఈ ముసలాయన రోజూ ఆమెకోసం మూప్పూ టలా—చాయ్, భోజనం, పళ్ళు వగైరా తీసుకొచ్చి ఇస్తూ వెతూ వుండేవాడట. ఆమె జబ్బు నయమవలేదు సరికదా ముదరసాగింది. స్పృహలో కూడా వుండేది కాదట. అయినా మల్హోత్రా ఆరుమైళ్ళ తల కీర్తినగర్ నుండి రోజూ మూడుసార్లు వచ్చి వెళ్లేవాడట. అయిదారు వారాలక్రింద ఒకనాడు సాయంకాలం ఆస్పత్రినుండి ఇంటికి బస్సెక్కుతూఉండగా బస్సు కదిలింది ఆయన క్రింద పడ్డాడు. కుడి ముంజేతి ఎముక విరిగింది వెన్నుపూసలు నాలుగు తొలగాయి. ఎడమ మోకాలిక్రింద ఎముక చీలింది. ఈ మర్సిపుల్ ఇంజరీస్‌లో ఈయన్ని ఇక్కడ చేర్చారు. ప్లాస్టర్ వేస్తే వాచి పోయిందిట దేహం. తీసేశారు. పుండ్లయ్యాయి. పుండ్లు సెప్టి కయ్యాయి. రోజు రోజుకూ ఈయన పరిస్థితి దిగజారుతూంది. మత్తుగా పడివుంటాడు. డ్రస్సింగ్ అప్పుడు ఆ నొప్పి తాళలేక అరుస్తుంటాడు. ఈయన భార్య ఇరవైరోజుల క్రింద చనిపోయింది. ఆ విషయం ఇంకా ఈయనకు తెలియదు. ఈయనకీ కొడుకూ, కూతురూ వున్నారు కొడుకు రక్షణ శాఖలో జాయింట్ సెక్రెటరీ —ఎప్పుడన్నా వచ్చి చూచిపోతుంటాడు. కూతురేమో సుప్రసిద్ధ రంగస్థల నటి. ఆవిడా అపుడపుడూ వచ్చిపోతుంటుంది కొడుకు, కూతురు వేర్వేరు కాపురాలు పెట్టారు మల్హోత్రా, ఆయన భార్య కీర్తినగర్‌లో వుంటున్నారు.

భూషణ్ ఈ వివరాలన్నీ చెబుతుంటే గాంధి నవ్వాడు.

'రావ్‌సాబ్‌కు పాతల పరిచయం చేస్తున్నట్లుందే—'

భూషణ్‌ని వాళ్లన్నయ్య పిలిచాడు. వాళ్లిద్దరూ, గాంధి వార్డుబాయితో కలిసి వరండాలో పేకాట మొదలుపెట్టారు.

లక్ష్మికి మనసు కుదుటబడిందేమో...నిన్న మొన్న ఎట్లెట్లా వుండిందీ వివరంగా చెబుతూంది మొన్నరాత్రెల్లా నిద్రలేదట. నిన్న పొద్దున తన్ను ఆపరేషన్ థియేటర్లోకి తీసుకు వెళ్లి పోయాక, తాను బయటికి వెళ్లి చెట్టుక్రింద కూచుందిట. కాని కూచోలేక పోయిందిట మాటమాటకి వార్డ్‌బాయ్‌ని ఆపరేషన్ అయిందా లేదా, అని అడిగి తెలుసుకునేదిట. తిరా థియేటర్‌నుండి రికవరీవార్డులోకి తీసుకువెళ్తుంటే చూచిందిట.

'మీ నోటిలో ఏదో బిరడా లాటిది వుంది .భయంవేసింది. మిమ్మల్ని పలకరించాలనిపించింది...'

లక్ష్మి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు వెంకట్రావు.

మరు రోజు కొద్దిగా బ్రెడ్, బిస్కెట్లు, పండ్లు లోపలికి వెళ్లేసరికి కొద్దిగా బలం వచ్చింది

ఆ తర్వాత రోజు డాక్టరు గుప్తా స్వయంగా వచ్చి లేపి కూచో పెట్టాడు నాలుగు రోజుల తర్వాత కూచోవడం! వెన్ను పూస వెన్నుపూసలా వుంది. ఆ వ్యాత్రం కూచోవడానికి ఎంత

వేయానే.. ఒకప్పటి కాలేజి స్ప్రింటింగ్ ఛాంపియన్ ఓ. వెంకట్రావు ఈ నాడు కూచోపెడానికి......!!

మధ్యాహ్నం పన్నెండింటికి లక్ష్మి తెచ్చిన అన్నం అంతా నెమ్మదిగా తింటుండగా—

మల్హోత్రా కూతురు వచ్చింది.

నల్లగా పొడుగ్గా వుంది. మోచేతులదాక చేతులున్న రవిక ధరించింది. ముఖంలో క్రూరమయిన హుందాతనం వుంది

నాన్న దగ్గరకు వెళ్లింది, ఒంగి చూచింది. 'నాన్నా' అని పిలిచింది మల్హోత్రా పలకలేదు, పరిశీలించి చూచింది. మల్హోత్రా ఒంటిమీద గాయాలమీదకు చీమలు బారులు బారులుగా పాకుతున్నాయి.

నర్సును పిలిచింది. నర్సు వచ్చి చూచివెళ్లింది. వార్డ్‌బాయ్ వచ్చి డి.డి.టి. చల్లి, చీమలను దులిపాడు. నర్సు పడక దుప్పటి మార్చింది. అంతసేపూ నాటక దర్శకురాలిలా నిలబడింది మల్హోత్రా కూతురు

చూస్తున్నాడు వెంకట్రావు.

దాని పేరేమిటోగాని దొంగముండ—తండ్రి అవ్వవాడిట్లా పడివుంటే ఎక్కడ ఏ హీరోగాడితోనో కులుకుతుంది కాబోలు పెళ్లిసెటాకూ లేకుండా — ఆ కొడుకు ముండాకొడుకు పొద్దున వచ్చి వెళ్ళినట్టున్నాడు — వెధవ మీసాలు వాడూను— పెద్ద ఆఫీసరట—రెండువేలు జీతంట—ఇటాలియన్ పెళ్లాంట:.. ఎందుకొచ్చిన బిడ్డలు — బిడలా వీళ్ళు తలిదండ్రుల కడుపున చెడబుట్టిన గడ్డలు...వెంకట్రావుకు వొళ్ళు మండింది ఎక్కడో పాశ్చాత్య దేశాల్లో బిడ్డలు పెరిగి పెద్దవారవగానే ఎవరి మానాన వారు వేరువేరుగా జీవించడం మొదలు పెడతారనీ — ముసలి తల్లిదండ్రులు ఏ అనాథశరణాలయంలాటి దానిలోనో వారి తిప్పలు వారు పడుతుంటారనీ—వారిని చూడడానికి కొడుకులు కూతుళ్ళు చుట్టపుచూపుగా వస్తుంటారనీ విన్నాడు. తల్లిదండ్రులకు వారి జీవనసంధ్యావేళ ఆశ్రయం ఇవ్వలేని ఆ వ్యవస్థ వల్ల దుడిమీదికి మనిషిని పంపితే పంపునుగాక—అది రాక్షస వ్యవస్థ ..ఆ వ్యవస్థకు ప్రతినిధుల్లాటివాళ్ళే ఈ మల్హోత్రా కూతురూ, కొడుకూ...

ఆలోచిస్తూండగా నిద్రపట్టింది

తటాలున మెలకువ వచ్చి చూస్తే గదిలో హడావిడిగా వుంది. మెహ్రా మంచం చుట్టూ గొట్టాలు, స్టాండులు ఎక్కువయ్యాయి భూషణ్, వాళ్ళన్నయ్యా, వదిన, చెల్లెలు, నర్సు నిల్చుని వున్నారు హవుస్ సర్జన్ బ్లడ్ ప్రెషర్ చూస్తున్నాడు. శ్రీమతి మెహ్రా ఒకమూల చతికిలబడి కీచుగా ఏడుస్తూంది ... మధ్యమధ్య 'హాయ్ రామ్, హాయ్ రామ్' అంటూంది...

తెలుగు 'హాయ్'కీ హిందీ 'హాయ్'కీ ఎంతదూరమో చూచావా అంటున్నాడు వెంకట్రావు లోపలి లింగ్విస్టు.

ఇరవై నిముషాల తర్వాత పరిస్థితి కాస్త మెరుగనిపించింది కాబోలు డాక్టర్ వెళ్లిపోయాడు.

మెహ్రాభార్య ఆయన దగ్గరకు వెళ్లి మొహంలోకి మొహం పెట్టి పలకరించింది. 'ఇటుచూడండి'

"వినబడుతూందా?,'

'చాయ్ కావాలా?'

'అబ్బాయి వచ్చాడు—'

ఆ వెడల్పాటి, బస్తాలాటి మనిషి మొహం మీద ఆ ఆప్యాయత, అనురాగం చూస్తుంటే అయ్యో పాపం అనిపించింది. కాని మెహ్రా ఈ లోకంలో లేడు.

అయినా, అమ్మాయి చెంచాతో తేనీరు పడితే మింగుతున్నాడు ఆ అమ్మాయి ఒకసారి తేనీటి చెంచాను మెహ్రా పెదాలకానించి 'నాన్నా! నాన్నా! ఏదీ నోరుతెరు—' అంది గోముగా.

ముసలాడు నోరు తెరిచాడు. అమ్మాయికి పరమానందమయింది. తేనీరు ఆ నోట్లోకి పోస్తూ విజయగర్వంతో అరిచింది—'అమ్మా—అన్నయ్యా—వదినా—నాన్న నోరు తెరిచాడే! నేను చెప్పినమాట వినబడిందే అమ్మా!'

మెహ్రాపెళ్ళాం లక్ష్మితో చెప్పింది—'అమ్మాయివస్తేఅంటే ఆయనకు ప్రాణం-'అని, పమిటచెంగుతో ముక్కు తుడుచుకుంది. భూషణ్ అండ్ కో వరండాలో చేరి బిస్కెట్లతోసహా చాయ్ సేవిస్తున్నారు

అంతకుముందు క్షణం గాబరా...ఇప్పుడదంతా గడిచిపోయి నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు...మనుష్యులు !

సాయంకాలం గుప్తావచ్చి గాంధీని డిశ్చార్జ్ చేశాడు. గాంధీ గాంధీ పెళ్ళాల మొహంమీద సంతోషం వెన్నెలగా వెలిగింది.

ఆ రోజు మన కెప్పుడో అంది లక్ష్మి.

'ఇంకో వారమున్నా వుండాలి'అంది కస్తూరిబా...ఆమె పేదది కాకపోవచ్చు...

వాళ్ళు మూటాముల్లె సర్దుకుంటుండగా, అతిభయభక్తులతో ఒదిగిఒదిగి నిల్చుని వారికన్నీ అందిస్తున్నాడు దక్షిణాదియైన వార్డుబాయ్.

ఈలోగా ఆ ప్రక్క కుడిమూలమంచంమీదకు ఒకాయన వచ్చిచేరాడు. ఆయన రావడమే వివిధస్వరాలలో 'ఆ...ఆ... ఊ...ఊ'అని పురిటినొప్పులు పడుతూ వచ్చి చేరాడు. అతడితోపాటు ఒక పటాలం వుంది. అంతా బెంగాలీ దళమే...ఆ బెడ్ హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ సేన్‌వర్మదిట...అంచేత కాబోలు దానిమీదకు సాధారణంగా సోనార్‌బాంగ్లావాళ్లే వచ్చి చేరుతుంటారు. మొన్న వెళ్లినవాడు ముఖర్జీ అయితే వీడే ఛటర్జీయో అయివుంటాడు.

వాడి జనబాఅంతా క్రమంగా వెళ్లిపోయారు, పెళ్ళామూ, స్నేహితుడు కాబోలు ఇంకో అతడూ వుండిపోయారు. ఒకసారి వెంకట్రావు లేచికూర్చున్నప్పుడు ఆ ఛటర్జీకూడా లేచి మంచం మధ్యగా కూచొని, తీరికగా నొప్పులు పడుతున్నాడు...'ఆ.. కూ...' అని అరుస్తున్నాడు వాడిమొహం చూస్తే నక్కలా వున్నాడు; నల్లగా వున్నాడు; జూలియస్ సీజర్ కంటికి కేషియస్‌లా వున్నాడు.

అరగంటకోసారి డాక్టరునీ, నర్సునీ పిలిపించి, 'అమ్మమ్మ' 'అయ్యయ్యో' అని సణుగుతూ, నొప్పులు వస్తున్నా మాత్రలు మింగుతున్నాడు. 'నేనే డాక్టరయివుంటేనా అరనిమిషం పాటు (?) బొర్నిటోన్‌మాత్ర లిచ్చేద్దును...వెధవ గొడవా వాడూనూ' అనుకున్నాడు పేషెంటు వెంకట్రావు.

ఆ సాయంకాలం వెంకట్రావును చూడడానికి వాళ్ళాఫీసు వాళ్ళు వచ్చారు. పండ్లూ అవీ తెచ్చారు.

వీళ్ళందరూ నిజంగా ప్రేమతోనే వచ్చారా, లేక— అయ్యో— రాకపోతే బాగుండదే అని వచ్చారా—ఆఫీసునుండి తిన్నగా కొంపలు చేరడానికే బస్సులు దొరికిచావని వెధవ వూళ్ళో మధ్యలో ఈ ఆసుపత్రికివచ్చి పోవడం అంటే పెద్దయజ్ఞం చేసినంత పని...

పిల్లలు వాణి, శంకరులను పక్కింటాయన తీసుకొచ్చారు. వాళ్ళు నాన్న నేమో ప్రశ్నలడిగారు. ఆ ముసలాయన ముక్కులో గొట్టాలేమిటి అని అడిగారు. నాలుగేళ్ళ శంకరయితే 'నాన్నా! మీరు ఇంటికి వచ్చాక నా కట్లాంటి రబ్బరు గొట్టం కొని పెడతారా' అని అడిగి హామీ పుచ్చుకున్నాడు.

వెంకట్రావు, రాత్రి లక్ష్మిని ఇంటికి వెళ్ళమన్నాడు. ఇవాళ ఆరవరోజు. తను కొద్దిగా కదలగల్గుతున్నాడు. పొర్లుతున్నాడు, తనంతట తానే కూచుని, పడుకో గల్గుతున్నాడు. సుప్తి అయితే...రేపటినుండి నెమ్మదిగా లేచి కొద్దిగా తిరగండి— అన్నాడు...వో యబ్బో...తిరగడమే...ఎవరెస్టు ఎక్కమన్నట్టుగా వుంది.

ఆ రాత్రి ఏడు గంటలవేళ—

మల్హోత్రా వున్నట్టుండి అరవసాగాడు.

'డాక్టరూ—నన్నొదిలేయి—నేను ముసలాణ్ణి. తండ్రీ నన్ను చంపకు—వదలి పెట్టండయ్యా వదలిపెట్టండి...నన్ను చంపకండి—నన్నే చచ్చిపోనివ్వండి—బాబోయ్ నా వల్లకాదు...నాయనోయ్... నే చచ్చిపోతా—చచ్చిపోతా—'

ఆ అరుపులు, ఆ దీనారవాలు, మరణానికి ఆ ఆహ్వానాలు, ఆ ఆక్రందనాలు ఆ గదిని నరకంగా మార్చాయి. ఏమి బాధో... ఎంత బాధో...అయ్యో పాపం—

నర్సు వచ్చింది: 'వూరుకోండి మిస్టర్ మల్హోత్రా! పడుకోండి...నిద్రపోండి...అరవకండి మల్హోత్రాజీ, నిద్రపోండి—'

కాని మల్హోత్రా అరుపులు తగ్గలేదు.

వెంకట్రావు వయిదు టెంపరేచర్ తీసుకోవడానికని ఇంకో నర్సు వచ్చినప్పుడు వెంకట్రావు అడిగాడు. 'మల్హోత్రాకు సెడేటివ్ ఇవ్వరాదా ?'

'ఆయన కండిషన్‌లో సెడేటివ్ ఇవ్వరాదండి...'

అరుస్తున్నాడు మల్హోత్రా...గావుకేకలు పెడుతున్నాడు. నిముషానికోసారి చచ్చిపోతానంటున్నాడు. నోరారా చావును రమ్మని పిలుస్తున్నాడు. మగతను చీల్చుకుని బాధ— అరిచిన ఆ అరుపులు మరణానికి మేలుకొలుపులులాగా వున్నాయి.

ఆ గదిలోకి ఒక లావుపాటి ఆయన వచ్చాడు.

తెల్ల చొక్కా, తెల్ల పంట్లామూ — నెరిసిన జుత్తూ... నిండుగా వున్నాడు. నిదానంగా మల్హోత్రా మంచం దగ్గరకు వెళ్ళాడు.

'మల్హోత్రా !' అని పిలిచాడు. ఆ పెద్దుగలాయన కేకలు పెడుతున్నాడు.

'మల్హోత్రా !' అన్నాడు మళ్లీ. అరిచాడు.

అయిదారుసార్లు దృఢమైన స్వరంతో, అధికారంతో పిలిచాడు స్నేహితుడు. హఠాత్తుగా—ఎన్నో చీకటి లోకాలకవతల, మగత తెరల కవతల వున్న మల్హోత్రాకు ఆ మిత్రుడి కంఠం వినిపించింది......ఆ కంఠం వినిపించిందంతే...కన్ను లేదు. చెవి లేదు. జ్ఞాపకం లేదు. సంబంధం లేదు.

'మల్హోత్రాజీ! నేను సోంధిని. .'

'అయ్య నాయనోయ్—నా కొద్దు—డాక్టరుగారూ, నన్ను విడిచిపెట్టండి—నే చచ్చిపోతా—నే చచ్చిపోతా—'

'అట్లా అనకు మల్హోత్రా, అట్లా అనకు—'

'ఆ...'

'ఏదీ—అను—అను, రామ్ రామ్—'

'అయ్యో—అయ్యయ్యో—'

'కాదు కాదు, రామ్ రామ్—హరే రామ్—'

మల్హోత్రా నిశ్శబ్దం...సోంధిమట్టుకు 'రామ్ రామ్' 'హరే రామ్' అని నిదానంగా మృదువుగా అంటున్నాడు

మల్హోత్రా ముసలిగొంతులోంచి, జీరగొంతులోంచి చీల్చుకుని వణుకుతూ వచ్చింది – 'రామ్ !'

సోంధి గొంతులో ఉత్సాహం వచ్చింది.

'రామ్...హరే రామ్...శ్రీ రామ్...'

మల్హోత్రా కూడా అంటున్నాడు. 'రామ్—హరే రామ్— శ్రీ రామ్.'

రెండు మూడు నిముషాలు. .

సోంధి అన్నాడు—'రామ్—'

మల్హోత్రా అన్నాడు. ''రామ్ !''

సోంధి—''రామా! నన్నీ బాధనుండి—''

మల్హోత్రా—''రామా ! నన్నీ బాధనుండి—''

''తప్పించు రామా—''

''తప్పించు రామా—''

ఇటు ఈ గొంతు...గట్టిగొంతు...నమ్మినగొంతు

అటు ఆ గొంతు ... పలచగొంతు ... నమ్మకం వినిపించిన గొంతు—

''రామా...నాకీ బాధ...''

"అత్తరి...రామా లేదు...ఏమీ లేదు." అని అరిచింది మల్హోత్రా గొంతు...తిరగబడింది చీకటి—

సోంధి భయపడలేదు ... నిరుత్సాహ పడలేదు... ప్రయత్నం మానలేదు...మళ్ళీ అన్నాడు.

"రామా, నాకీ బాధ—"

"రామా, నాకీ బాధ—"

"వద్దు తండ్రీ."

"వద్దు తండ్రీ..."

మందరంలో ఒకటి, రిషభంలో ఒకటి వినపడుతున్నాయి గొంతులు

"రామా రామా.."

"రామా రామా.."

"హరే రామా..."

"హరే రామా..."

"శ్రీ రామా—"

"శ్రీ రామా—"

అదొక మంత్రమో, జపమో, గీతమో, సంగీతమో సాగుతూంది.

క్రమంగా, మల్హోత్రా గొంతు సన్నగిల్లింది. మళ్ళీ ఆ జీవుడు ఎక్కడో తెరవెనుక అణిగిపోయాడు. మళ్ళీ ఏ ఎముకో, కండరమో పిచ్చికుక్కలా పీకితే, కుయ్యోమని మొరపెడుతుంది దేహం.. అప్పుడు స్నేహితుడు కావాలి ..సెడెటివ్ కావాలి ... నర్సు కావాలి .. నవనీతంలాటి లాలింపు కావాలి ... ఆ బాధకు అమృతం పూయాలి...ఆ నొప్పికి లేపనం పూయాలి. గాయపడిన దేహానికి— అంతకన్న ఎక్కువ గాయపడిన ఆత్మకు మందు కావాలి.

క్రమంగా మల్హోత్రా నిద్రవంటి మగతలోకి జారిపోవడం గమనించి, దగ్గరగా వెళ్ళి వంగి చూశాడు సోంధి.

నిట్టూర్చాడు. రుమాలుతో మొహం తుడుచుకున్నాడు. ప్రక్కమంచం మీదున్న బెంగాలీ వాడిని— "ఇవాళ వీరి అమ్మాయి, అబ్బాయి ఎవరూ రాలేదా?" అన్నాడు

వాడు ముక్కుతూ, మూల్గుతూ— "హయ్యో...హమ్మయ్యో హబ్బాయో—హమ్మాయో...హేమీ...హెరిదు..." హన్నాడు.

అప్పుడు భాషన్ చెప్పాడు. "రాలేదు..."

తల ఎందుకు వెలిపోయాడా నేస్తం...

నువ్వయ్యో...స్నేహితుడివిలాంటి...అనుకున్నాడు వెంకట్రావు.

మరునాటిరోజు పొద్దున లేచిచూస్తే, ఆ మూల బెంగాలీ వాడు లేడు. ఏమిటయ్యాడు అని వార్డుబాయ్ నడిగాడు వెంకట్రావు.

'మల్హోత్రాగారి అరుపులకు భయపడ్డాడుట ... ఆయన బ్లడ్‌ప్రెషర్ హెచ్చిపోయిందిట...అందుకని ఆయన్ను వేరే గదిలోకి మార్చారు—'

నోహో గుండెకాయా...అనుకున్నాడు వెంకట్రావు.

మధ్యాహ్నం లక్ష్మి వచ్చింది అన్నమూ అదీ తీసుకుని. నెమ్మదిగా నాలుగుముద్దలు తిని పక్కవాడి వేసుకుని పడుకున్నాడు.

'ఎట్లా వున్నారు—' అంటూ వచ్చాడు డాక్టర్ గుప్తా. పరీక్ష చేశాడు

'వూండ్ బాగా హీల్ అవుతూంది...గుడ్...లేచి నడుస్తున్నారా?'

'లేదు.'

'ఫరవాలేదు—'

'కొద్దికొద్దిగా నడవండి...'

'ఇంటికి ఎప్పుడు వెళ్ళవచ్చునండీ ..'అని అడిగింది లక్ష్మి.

'భలేవారే...మొన్నటిదాక భయపడిపోయారు......అప్పుడే ఇంటికి వెళ్ళడంగురించి అడుగుతున్నారే...'అని నవ్వి—'ఇంకో వారం వుండాలి...' అన్నాడు డాక్టరు

అమ్మో—అనుకుంది లక్ష్మి మనసు—

—నిద్రపోయాడు వెంకట్రావు.

లేచేసరికి పక్కన గాంధీ ఖాళీచేసిన మంచంమీద ఒక తెల్లటి బొద్దుమనిషి కూర్చునివున్నాడు. కళ్ళకు కాటుకా ఎదీ పెట్టుకుని కథకళి నృత్యానికి తయారవుతున్నవాడిలా వున్నాడు. ఆయన భార్యామణి—అసలు మెడే లేదు – కమలాపండ్లు ఒలిచి తొనలు ఇస్తుంటే తాపీగా తింటున్నాడు.

చూస్తే ఏజబ్బూ వున్నట్లులేదు. కేవలం కమలాపండ్లు తినడానికని ఆస్పత్రి స్పెషల్‌వార్డులో చేరినట్లుగా వుంది వాలకం

వారినిగురించి ఊహాగానం చేశారు వెంకట్రావు దంపతులు.

ఆ సాయంకాలం వెంకట్రావును చూడ్డానికి ఇంకొందరు ఆఫీసుమిత్రులూ, దూరపుబంధువులూ వచ్చారు.

మల్హోత్రా కూతురూ, దానితోబాటే దాని మొగుడో మరెవడో ఒక గళ్ళచొక్కావాడు వచ్చారు.

మెహ్రాను చూడడానికి వో పాతికమంది వచ్చారు. అతడికి ముక్కులో గొట్టం, చేతిరక్తనాళాల్లోకి గొట్టం, మూత్రానికి గొట్టం, మనిషిపొట్ట పైకి లేచి కిందపడడంతప్ప ఇంకేమీ చలనం లేదు

కాటుకకళ్ళవాడింకా రోగిష్టిలా సవ్యంగా మంచంమీద పడుకోనన్నా పడుకోలేదు, వాడికీ విజిటర్సు వచ్చారు.

అయిదోమంచం ఖాళీగా వుంది.

విజిటింగ్ సమయం అవగానే అందరూ వెళ్ళిపోయారు. లక్ష్మికూడా వెళ్ళిపోయింది.

. ..........వెంకట్రావు పరికించాడు.........

మెహ్రాదగ్గర అతడి కూతురు నిల్చునివుంది. పాపం అమ్మాయిగారికి తీరికదొరికింది కాబోలు...

పడకదుప్పటి సరిచేసింది. నర్సుని పిలిచి ఏదో అడిగింది.

నాన్నా, నాన్నా—అని పిలిచింది చలనంలేదు కాస్సేపటికి సోంధీ వచ్చాడు. అమ్మాయిని పలకరించాడు. మల్హోత్రా దగ్గరకు వెళ్లాడు.

'మల్హోత్రా! మల్హోత్రా!' అని అదే పనిగా అయిదారు సార్లు పిలిస్తే—గుహాలోపలినుండి ముసలి పులి గర్జించినట్లు—' 'ఊ' అన్నాడు మల్హోత్రా...

'మల్హోత్రా! చాయ్ తాగావా?'

'వద్దు...చాయ్ వద్దు ..చావు కావాలి. నా '

'అట్లా అనకు...అట్లా అనకు ..'

'ఒది వచ్చిందా... ' దొంగ కుంక ..'

'సోంధీ ఇరకాటంలో పడ్డాడు .ఆమె తలొంచుకు నిల్చింది అపరాధినిలా...

'వచ్చింది...పూనమ్ ఇక్కడే వుంది'...'

'ఆ వెధవ?' కొడుకు కాబోలు—

'రాజేష్ మధ్యాహ్నం వచ్చి వెళ్ళాట్ట' .అసత్యమేగాని ప్రియమ్ బ్రూయాత్...

'ఊ!'

'డాక్టర్ వచ్చాడా?' సోంధి అడిగాడు జవాబు లేదు. ఇంకా రెండు మూడు ప్రశ్నలు అడిగాడు జవాబు లేదు మల్హోత్రా లోని ప్రాణాన్ని తనకు కొంటుకూ కూతురూ దూరమయిన బాధ తప్ప ఇంకే విజమూ స్పృశించడం లేదన్నమాట—మిగతా వేమీ కన పడవు...వినపడవు లదోఎదమైన సమాధి—

అరగంట అట్లాగే నిలబడి నిలబడి పూనమూ, సోంధీ కూడా వెళ్లిపోయారు.

రాత్రి తొమ్మిది దాటింది

అప్పుడు ప్రక్కమంచం ఆయన వెంకట్రావును పలక రించాడు పేరు ఆహూజాట. సింధీలట...దేశం చీలినాక పాకిస్తాన్ నుండి వచ్చేశారట. ఛీఫ్ ఇంజనీర్‌గా రిటైరయినాడట—మూత్ర కోశంలో ఏదో గొడవ.. పరీక్షలకని ఆస్పత్రిలో చేరమన్నారట... ఒకే ఒక కొడుకట వాడు ఎలక్ట్రికల్ ఇంజనీరట .సొయింత్రం వచ్చాడట...ఇవన్నీ చెబుతూ వచ్చి హఠాత్తుగా 'ఏమండీ రావుగారూ మీకు దేవుడిమీద నమ్మకం వుందా?' అనడిగాడు.

'ఏమిటి అలా అడిగేస్తున్నాడు '

'నాకు మాత్రం మొదట వుండేది కాదు...తర్వాత ఒక సంఘటనతో ఏర్పడింది...' అంటూ చెప్పడం మొదలెట్టాడు

తాను అసిస్టెంట్ ఛీఫ్ ఇంజనీర్‌గా సింధ్‌లో పనిచేస్తున్న రోజులలో క్యాంప్ వెళ్లేవాడట తనతోబాటు ఒక మనిషి వుండే వాడు—వాడే వంటవాడూ, బంట్రోతూను ..ఒకసారి ఒక కొండ ప్రాంతం వూరికి వెళ్లి ఒక నెల వుండాల్సి వచ్చిందట...అక్కడో బంగళా ఇచ్చారుట తోటలోవున్న అవుటవుస్‌తో ఆఫీసుపెట్టు కున్నాడు. రోజూ అందమైన తోటమధ్య ఆ అవుటవుస్‌లో కూచుని పొద్దున్నుండి మధ్యాహ్నందాక కాగితాలు చూచుకునేవాడు...చలినివారణ కోసం గది మూలలో పెద్ద కుంపటి వుండేది హాయిగా వెచ్చగా తదేకంగా పని చేసుకునేవాడట . పొద్దుగావుండే నల్లపిల్లి ఒకటి రోజూ వచ్చి మేజా క్రింద తన పాదాల దగ్గర, వెచ్చదనానికోసం, పడుకునేది నాలుగైదు గంటలపాటు తన పని చూసుకుంటుంటే అది అట్లాగే పడుకుని వుండేది. తాను లేవగానే అదీ లేచేదిట. కొన్నాళ్ళకు ఆ పిల్లి తన పాదాల సందున పడుకోవడం అన్నది బాగా అలవాటయిపోయి దానిని గమనించడం మానివేశాడట

రెండు మూడు వారాల తర్వాత ఒకనాడు పొద్దున్నే వెళ్ళి కూచుని పని మొదలెట్టాడట...మధ్యాహ్నం పని ముగిశాక లేవ బోతూ ఎందుకో కాళ్ళ దగ్గర చూశాడట—

తన పాదాల నడుమ ముద్దుగా ముడుచుకుని ఒక త్రాచుపాము పడుకుని వున్నదిట '

పై ప్రాణాలు పైనే ఎగిరిపోగా నెమ్మదిగా దేవుడి పేరు చెప్పుకుంటూ ... తీసేలోగా పాదాల మీద కాటేస్తుందేమో—దేవ దేవా కావరావా.. అనుకుంటూ పాదాలు తీశాడు...అప్పుడు ఆ పాము జర జర పాకి తోటలోకి వెళ్లిపోయింది...

నౌకరుని పిలిచి అడిగాడు—

'ఆ నల్లపిల్లి ఏమయింది—'

'అది వారం క్రింద ఒకనాడుదయం తోటలో చచ్చి పడి వుందండి ..తీసి పారేయించాను...' అని చెప్పాడు వాడు...

అయితే—

అయితే—ఈ వారం రోజులనుండీ

వారం రోజులనుండీ –

తన పాదాల దగ్గర పడుకున్నది—

పడుకున్నది—

పాము !

పామే ? బాబోయ్...ఈ వారంలో ఎన్నిసార్లు పాదాలు కదిలించాడు తాను. .ఎన్నిసార్లు పాదం దానికి తగిలిందో కాని ఆ విష సర్పం తన్ను కాటేయలేదు .

" 'భగవాన్ ! నువ్వున్నావు సుమీ . వుండడమే కాదు. ఈ మూర్ఖుడని రక్షించావు వీడు నిన్ను నమ్మకపోయినా నువ్వు వీడిని మరవలేదు' అనుకున్నాను సుమండీ రావ్‌జీ! ఆనాటినుంచి ఐ ఏమ్ ఏ గాడ్స్ మేన్!'' అన్నాడు ఆహూజా.

వెంకట్రావుకు నవ్వొచ్చింది పాము కూడా దేవుడి ఏజెంటన్న మాట ..రకామని అవిశ్వాసాన్ని విశ్వాసంగా మార్చివేసింది...

శివుడి ఆజ్ఞ లేనిదే అన్నారు కదా. .వాట్ ?

అవీ ఇవీ కబుర్లు చెబుతూ రాత్రి నిద్రపోయాడు.

మరుసటి రోజుదయం లేచి వార్డ్‌బాయ్ సాయంతో పది గజాలు నడిచాడు వెంకట్రావు. ఆయాసం! నెమ్మదిగా ఒక బెంచీ మీద కూలబడ్డాడు...పాయ్‌ఖానాలోకి వెళ్లి వచ్చేసరికి అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఈది వచ్చినట్లుంది గుండె ఠక ఠక మని తలుపులు కొట్టినట్లు కొట్టుకుంటూంది.

ఉన్నట్టుండి మెహ్రా మంచం దగ్గర హడావిడి మొదలయింది.

ఇద్దరు డాక్టర్లు పరుగెత్తుకొచ్చారు. నర్సులు ఇటూ అటూ 'ట్రే' లు పట్టుకొని పరుగెడుతున్నారు. మెహ్రా మంచం చుట్టూ తెరలుపెట్టారు. ఇంజక్షన్ కాటోలు యిచ్చారు. ముక్కులోకి ఇంకోగొట్టం పెట్టారు. గొంతులోని కఫాన్ని బయటికి తీశారు. గుండెదగ్గిర మర్దన చేస్తున్నారు. మెహ్రాభార్య 'హాయ్ హాయ్' అంటూ సన్నగా ఏడుస్తూ తలపట్టుకొని చతికిలపడింది.

'ఆక్సిజన్! ఆక్సిజన్'

పరుగెత్తారు. సిలిండర్ తెచ్చారు.

ఈ పతాక సన్నివేశపు ఆయుస్సు పదిహేను నిముషాలు.

పదహారవ నిముషం—

మెహ్రాప్రాణం దేహంనుండి సెలవు తీసుకుంది.

గొల్లుమన్నారు.

డాక్టర్లు నర్సులు రణరంగంలో ఓడిపోయిన సైనికుల్లా తలవంచుకుని వెళ్ళిపోయారు.

ట్యూబులు, ట్రేలు, గొట్టాలు, పరికరాలు — యుద్ధరంగంలో ఆయుధాలవలె చెల్లాచెదరుగా పడివున్నాయి.

అయ్యో — ఏమండీ

అయ్యయ్యో — నా తండ్రీ

నాన్నగారూ — ఏమండీ — బాబూజీ — హాయ్ రామ్ — అయ్యో. మీకింతలోగా—అయ్యయ్యో ..పాడుచావు నాకు రాకూడదా..

వికారంగా వికృతంగా, అసహ్యంగా ఏడుపులు . ఏడిస్తే వెనక్కొచ్చిన ప్రాణం ఒక్కటుందా...అయినా ఏడుపే...ఏడుపునొక ప్రదర్శనగా చేస్తారెందుకు— అంత గొడవ చేస్తారెందుకు — మృత్యువన్న మహాసత్యం ఎదుట హుందాగా నిలబడరెందుకు —

నీకేమిటోయ్ వెంకట్రావ్.. మెట్ట వేదాంతిలా కల్లిబొల్లి కబుర్లు ఎన్నయినా చెప్పగలవు...

నర్సు వచ్చింది ... 'మీరు కావాలంటే పక్కగదిలో వో మంచం ఖాళీగా వుంది...అక్కడ వెళ్ళి పడుకోండి...' అంది.

'అబ్బే ఫరవాలేదు' అన్నాడు వెంకట్రావు చావంటే భయం లేదు. చావుకోసం ఏడిచే ఏడుపులు వినడం రోతగా వుంటుంది. అది కాఠిన్యమా — క్రౌర్యమా — ఏమో —

ఏడుపు లయ్యాయి. కొత్తవా ళొచ్చారు. కొడుకు లొచ్చారు. కోడళ్ళొచ్చారు. కూతుళ్లళ్లుళ్ళొచ్చారు. కావలసినవా ళ్ళొచ్చారు. తలో ఏడుపూ ఏడిచారు. కళ్లు తుడుచుకొన్నారు. ముక్కు చీదుకున్నారు. తలలు ఒంచుకున్నారు. వరాండాలోకి వెళ్ళారు. అక్కడ కూచుని మళ్ళీ ఏడిచారు.

మధ్యలో స్ట్రెచ్చర్ వచ్చి ఆహూజాని తీసు కెళ్లింది.

బ్రేక్‌ఫాస్టు వస్తే వద్దు పొమ్మన్నాడు వెంకట్రావు.

ఇంకో స్ట్రెచ్చర్ వచ్చింది

మెహ్రా దేహాన్ని పడుకోబెట్టి తెల్లగుడ్డ కప్పారు.

తెల్లజెండా! ప్రాణానికీ మృత్యువుకూ జరిగిన పోరాటంలో శాంతిబావుటా

స్ట్రెచ్చర్ చరచర వెళ్ళిపోయింది. వరుసగా బంధుమిత్రులు దానివెంట నడిచారు. భూషణ్ అల్మారాలో వున్న గుడ్డల్ని, డబ్బాల్ని, వస్తువుల్ని బుట్టల్లోకి, సంచుల్లోకి సర్దుతున్నాడు. అయిపోయింది. తాము వచ్చిన పని అయిపోయింది. ముక్కు చీదుకుంటూ అన్నీ సర్దాడు.

'నమస్తేను రావ్‌సాబ్!' అంటూ భోరున ఏడిచేశాడు.

అతడి బుజ్జను నిమిరాడు రావు.

భూషణ్ బరువుగా నడిచాడు బయటకు.

బయటనుండి శ్రీమతి మెహ్రా లోపలికి వచ్చింది. 'హాయ్ రామ్! నేనేమి చెయ్యనా భగవంతుడా!' అని అంగలార్చుతూనే ముక్కు కళ్ళు తుడుచుకుంటూనే అల్మారా తలుపులు తెరిచింది. పైనుండి క్రిందదాక పరిశీలించి చూచింది. మంచంకింద చూచింది. ఇటూ అటూ చూచింది. తమది ఏ చెంచావో ఇక్కడ వుండిపోతుందేమో...అన్నీ చూచాక, ఏమీ వుండిపోలేదని తెలిశాక— 'అయ్యో రామా! ఆయన్ను తీసుకు వెళ్ళిపోతివే!—నా తండ్రీ—ఇక నేను ఎందుకుండడం రా తండ్రీ—'అంటూ బయటికి నడిచింది.

'చెంచాలు వెతికేందుకు'—అనుకున్నాడు వెంకట్రావు.

అమెరికాలో మెహ్రా పెద్దకొడుకు ఏంచేస్తుంటాడు—మేన్‌హాటన్‌లో షాపింగ్ చేస్తుంటాడా? న్యూయార్క్ నైట్‌క్లబ్‌లో న్యూడ్ నృత్యం చూస్తుంటాడా? ఎవరికి ఎవరు ఏది ముఖ్యం .. అనుబంధమా...అమెరికాలో వుద్యోగమా—మొగుడిప్రాణమా, స్టెయిన్లెస్‌స్టీలు చెంచానా...

ఆలోచనల్లోనుండి బయటపడేసరికి పన్నెండు దాటింది.

లక్ష్మి వచ్చింది.

ఆ మంచం ఖాళీగా వుంది. విషయం గ్రహించి వణికిపోయింది. వార్డుబాయ్ వచ్చాడు. 'దొంగపీనుగులు నెల రోజులకు పైగా రాత్రింబవళ్లూ చాకిరీ చేయించుకున్నారండీ...రూపాయి డబ్బులన్నా ఇవ్వకుండా చెక్కేశారు ..దుర్మార్గులు—' అంటూ గది తుడవసాగాడు.

'లక్ష్మీ! నీతి ఏమిటి—?' అన్నాడు వెంకట్రావు.

'మనం వెళ్లేప్పుడు ఇద్దాము లెండి—'

రెండింటికి ఆహూజాని మళ్లీ మంచంమీదకు చేర్చారు.

కాస్త అలసినట్టున్నాడంతే...తలగడా కానుకుని కూర్చునే విమర్శ మొదలెట్టాడు ఆహూజా.

ఈ డాక్టర్లంతా పసికుంకలండీ...ఏమి చెయ్యాలో ఎవడికీ తెలీదు—మన దేహం ప్రతివాడికి ప్రయోగశాలన్నమాట – అడ్డమైన నాలుగో సంవత్సరం వాడూ రావడం...ఒకడు సూదితో పొడవడం —ఇంకోడు రక్తం తీసుకోవడం – అటు పొడవడం—ఇటు పీకడం— నాలుక చాపమనడం— కళ్లెగరవేయమనడం... ఛీఛీఛీ.....డిగ్నిటీ

లేదు, పాడా లేదు - ఈ ఆస్పత్రిలో మనుష్యులు చచ్చిపోక బ్రతుకుతారుటండీ.. ఎవడన్నా బతికితే అది ఆ పరమాత్ముడి చలవ —అంతే గాని ఈ అజ్ఞానుల వైద్యం వల్లకాదు...

అన్నీ విన్నాడు వెంకట్రావు.

—సాయంకాలం దీపాలు పెట్టేదాక వుండి వెళ్ళిపోయింది లక్ష్మి.

ఆహూజా కూడా డాక్టర్‌తో పోరాడి డిశ్చార్జి చేయించుకుని కొడుకుతోబాటు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ, వెళ్ళిపోతూ వెంకట్రావుతో అన్నాడు - 'రావ్ సాబ్—నేను రాజేంద్రనగర్—డి—191 లో వుంటున్నాను. ఇంట్లో టెలివిషన్ కూడా వుంది. యు కెన్ ఎంజాయ్ ఇట్. .రండి...'

తల వూపాడు వెంకట్రావు. లోలోపల నవ్వుకున్నాడు.

ఆ రాత్రి మల్హోత్రా కూతురూ, కొడుకూ వచ్చి కాసేపుండి వెళ్ళిపోయారు. సోంధి రాలేదు.

ఆ మర్నాడుదయం తెనర్జీ, ఛటర్జీల మంచం మీదకు ఇంకో ఫొషిల్ మోహియ్ వచ్చి రావడం—

రావడం రావడం తుఫానులా వచ్చాడు. పెళ్ళాంతోబాటు వచ్చాడు. మంచం మీద పద్మాసనం వేసుక్కూచున్నాడు. బెల్ నొక్కాడు. వార్డ్‌బాయ్ వచ్చాడు.

'బాయ్! నర్సుని పిలు—'

నర్స్ వచ్చింది.

'సిస్టర్!...నాకు మధ్యాహ్నం నాన్ వెజిటేరియన్ మీల్సు రెండు పంపండి...ఫ్రూట్సు కూడా పంపండి—' అని హుకుం జారీ చేశాడు. వాళ్ళావిడ అద్దం ముందు పెట్టుకుని తల దువ్వుకో సాగింది. ఆయనేమో సిగరెట్టు తాగుతూ వారపత్రిక కేదో తిరగ వేయసాగాడు. మధ్య మధ్య 'హోక్లే చలో రే' అని రాగం ఆలాపిస్తున్నాడు.

వార్డ్‌బాయ్ చెప్పాడు వెంకట్రావుతో—ఆయన హార్ట్ పేషెంటుట. చెకప్‌కోసం వచ్చాడట. ఆరోగ్య మంత్రిత్వశాఖలో అసిస్టెంట్ సెక్రటరీట...

అదీ కథ—అనుకున్నాడు వెంకట్రావు.

ఆ రోజు గడిచింది. మరునటిరోజు మధ్యాహ్నం డాక్టర్ గుప్తా వచ్చి చూశాడు—ఇంకో రెండు రోజులలో మీరు వెళ్ళిపోవచ్చు—అన్నాడు. లక్ష్మి గంటలు లెక్కపెట్టుకోసాగింది.

ఘోషల్ వెళ్ళిపోయాడు.

గదిలో ఐదింట మూడు మంచాలు ఖాళీ .వెంకట్రావూ మల్హోత్రా వున్నారు.

సాయంకాలం, కాళ్ళదగ్గర గది మధ్య మంచంమీద పాత పరుపుమీదే కొత్త దుప్పటి పరిచాడు వార్డ్‌బాయ్. తలగడాకు గలేబు మార్చాడు. ఆ వెనకాలే దంపతులు వచ్చారు ఆవిడ అవగుంఠనమూ అదీ చూస్తుంటే ఉత్తరప్రదేశ్ వాళ్ళలా వున్నారు. అతడు సంపన్న రైతు కుటుంబపు బిడ్డలా వున్నాడు. ఆ మంచాన్ని ఆక్రమించే ముందుగా ఎందుకయినా మంచిదని—వార్డ్‌బాయ్‌ని అడిగాడు'—ఈ మంచంమీద ఎవ్వరయినా...?'

అది మెట్రో మంచం.

'అబ్బే—అదేమీ లేదు...ఈ మంచం చాలా మంచిది' అని హామీ ఇచ్చాడు వార్డ్‌బాయ్.

నిశ్చింతగా మంచం ఎక్కి పడుకున్నాడు రైతురాజా. కిర్రు కిర్రుమన్నాయి మంచం స్ప్రింగులు.

ఆహా! మంచం నవ్వుకుంటూంది అనుకున్నాడు వెంకట్రావ్.

రాత్రి ఎప్పుడో మెలకువ వచ్చి చూస్తే రైతుబిడ్డ నిద్ర పోతున్నాడు. అతడి కాళ్ళ దగ్గర తలపెట్టుకుని నిద్రపోతోంది అతడి పెళ్ళాం.

ఆ మరునాడు డ్రెస్సింగప్పుడు మల్హోత్రా అరవలేదు. ఆయన కొడుకు వచ్చి వెళ్ళాడు. సోంధి వచ్చి వో గంట ఆ మంచం ప్రక్కనే కుర్చీలో కూర్చుని వెళ్ళిపోయాడు.

రెండు రోజులయ్యాయి.

రైతుకు ముక్కులోకి, చేతికి రబ్బరు గొట్టాలు తగిలించారు. హైపర్ టెన్షన్‌ట...అవన్నీ చూచి భయపడి శ్రీమతి రైతు సన్నగా ఏడుపు మొదలెట్టింది. అతడి మిత్రులు ఎంతో సముదాయించారు కాని అవన్నీ శుభ సూచనలు కావని ఆమె గట్టి నమ్మకం. ఏదో రానున్న అపాయానికి ఇవి ప్రతినిధులని ఆమె భయం. హుక్కా పీల్చవచ్చునా అని రైతురాజా సంశయం.

ఆ మర్నాడు మధ్యాహ్నం వెంకట్రావు భోజనం ముగిశాక వో గంటకు డాక్టర్ గుప్తా వచ్చాడు. 'నేడు పన్నెండవరోజు కదా కుట్లు విప్పుతాను—' అన్నాడు. విప్పాడు.

బాధను పెదాలక్రింద అణచిపెట్టుకున్నాడు వెంకట్రావు. లక్ష్మి హరండాలో నిల్చుంది. బ్యాండేజి కడుతుంటే తన బాధను మరిచిపోవాలని, డాక్టరు నడిగాడు వెంకట్రావు.

'లోపల ఏ కత్తెరనీ మరచిపోలేదు కదా—'

గుప్తా నవ్వాడు — 'కత్తెరలు అంత చవకనుకున్నారా ఏమిటి ?'

ఇద్దరూ నవ్వారు.

పిల్చిటప్లా నవ్వడం ఆ రైతు పెళ్ళానికి బొత్తిగా నచ్చలేదు. తన భర్తకు ఇంత 'సీరియస్‌గా' వుంటే—ఆ పరిసరాల్లో ఎవరికయినా నవ్వెట్లా వస్తుందో —

సాయంకాలం డిశ్చార్జి చీటీ వస్తుంది — వెళ్ళిపోవచ్చు — ఓ నెలదాకా విశ్రాంతిగా వుండాలి — తేలిక ఆహారం తీసుకోండి — వెలయ్యాక ఓసారి వచ్చి కనుపించండి —అన్నాడు గుప్తా.

'థాంక్యూ డాక్టర్ —'

గుప్తా వెళ్లాడు.

లక్ష్మి — హనీమూన్ ప్రయాణానికిపళి సంతోషంగా కబుర్లు చెబుతోంది.

నాలుగ్గంటలికల్లా గడిచాయి. లక్ష్మి వస్తువులన్నిటినీ సర్ది పాగింది. డిశ్చార్జి చీటీ వచ్చింది.

ఆమె భయాన్ని ఎగతాళి చేశాడు వెంకట్రావు. 'ఆ రోజే నే చెప్పలేదూ...''

ఆమె మనసులో భయం తొలగిపోయింది. పెద్ద ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీనిండా సంతోషం, పెగ్గు, ఆశ, ఆనందం, భవిష్యత్తును గురించిన ఊహలు — ఏవేవో కుక్కుకుంటున్నది ఆవిడ. వస్తువులన్నీ సంచిలోకి, బుట్టలోకి కుక్కుతూంది

హఠాత్తుగా మల్హోత్రా మంచం వైపు చూశాడు వెంకట్రావు.

అయ్యో! ఆదెప్పుడు?

శివరీక్షణాన ఎవ్వరూ లేరా —

లక్ష్మి చూస్తే భయపడుతుంది. నెమ్మదిగా లేచాడు వెంకట్రావు.

రైతూ రైతుపెళ్ళామూ — 'ఇంటికి వెళ్లిపోదామా? ఎట్లా వెళ్ళిపోవడం—' అని చర్చించుకుంటున్నారు.

లక్ష్మి ఆసరాగా నెమ్మదిగా మంచం దిగాడు వెంకట్రావు.

పూనమ్ వెక్కిళ్ళతో ప్రవేశించింది.

'పితాజీ!' అని బావురుమంది.

లక్ష్మి తిరిగి చూచింది...'పదండి...వెళ్లిపోదాం—'

లక్ష్మి నానుకుని వెంకట్రావు వరండాలోకి నడిచాడు.

సిస్టర్ ఎదురయింది—'ఇంటికి వెళ్లిపోతున్నారా?''

తల వూచి నమస్కారం చేశాడు వెంకట్రావు.

సొంధి హడావిడిగా వస్తున్నాడు.

వెంకట్రావు, లక్ష్మి లిఫ్టుని చేరారు.

వెనక, ఆ గదిలోనుండి పూనమ్ రోదన విన్పిస్తూంది.

లిఫ్ట్ కిందకు దిగింది. నడుస్తున్నాడు వెంకట్రావు

మల్హోత్రా కొడుకు కళ్లొత్తుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు.

లక్ష్మి టాక్సీకోసం వెళ్ళింది. వెంకట్రావు వరండాలో బెంచీ మీద కూర్చున్నాడు.

స్ట్రెచ్చర్ తోసుకుని వస్తున్నాడు వార్డ్‌బాయ్—దాని మీద పడుకోబెట్టిన మనిషి మీద కప్పిన దుప్పటినిండా తడి తడిగా నెత్తురు మరకలు.

స్ట్రెచ్చర్ ఆపి అడిగాడు వార్డ్‌బాయ్—'సార్! వెళ్లిపోతున్నారా?' ప్రక్కనే వున్న బుట్టలోంచి లక్ష్మి పర్సు తీసి, దాని లోంచి రెండు రూపాయలు తీసి వాడి కిచ్చాడు వెంకట్రావు.

'ఆత్మహత్యకేస్సార్—' అని చిరునవ్వుతో వార్త సందించి స్ట్రెచ్చర్ తోసుకుంటూ వెళ్లిపోయాడు వార్డ్‌బాయ్.

లక్ష్మి వచ్చింది—'టాక్సీ వచ్చింది—'

నడిచి ఆస్పత్రి బయటికి వచ్చారు దంపతులు.

నైట్‌డ్యూటి నర్సులు మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వస్తున్నారు.

టాక్సీలో ఎక్కి కూచున్నాడు వెంకట్రావు.

లక్ష్మి ఎక్కింది. తలుపు వేశాడు డ్రైవర్.

చుట్టూ చూశాడు వెంకట్రావు.

టాక్సీలు, కార్లు, సైకిళ్లు, ఆటోరిక్షాలు, సంజె వెలుతురు, ట్రాఫిక్ కానిస్టేబిల్, చెట్లు, రోడ్లు, భవనాలు, ఆఫీసు నుండి ఇళ్లకు వెళ్తున్న ఉద్యోగులు, వీధిదీపాలు...మెహ్రాలు మల్హోత్రాలు—ఆహూజాలూ గాంధీలు—బెనర్జీలూ ఛటర్జీలు—పూనమ్‌లు సొంధిలు—గుప్తాలు సర్దార్జీలు — వెళ్తున్నారు. వెళ్లుతున్నారు. వెళ్ళుతూవున్నారు.

— జీవితం కళకళలాడుతూ, గలగలలాడుతూ వుంది.

విందుగా వుంది; క్రొత్తగా వుంది.

పెద్దగా నిట్టూర్చాడు వెంకట్రావు.

టాక్సీ కదిలింది.